క్లుప్తంగా

మర్రి కామయ్య వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

హుకుంపేట: ఆదివాసీ స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధుడు మర్రి కామయ్య వర్ధంతి వేడుకల పోస్టర్‌ను శనివారం కామయ్యపేటలో సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్రి కామయ్య వర్ధంతిని సోమవారం నిర్వహిస్తున్నామని, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు

హుకుంపేట: గిరిజనుల ఆరాధ్యదైవం మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మండల కేంద్రంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్లాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మర్రి కామయ్య వర్ధంతి వేడుకలు రేపు

హుకుంపేట: ఆదివాసీ స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధుడు మర్రి కామయ్య వర్ధంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు పాంగి రామారావు, కొర్ర పెంటన్న, పాంగి అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మర్రి కామయ్య వర్ధంతి వేడుకలకు మండలంలోని నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వేడుకల్లో గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఆటపాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బకులూరు పంచాయతీ అంకంపాలెంకు చెందిన తూబెరి యేసుబాబు శనివారం ద్విచక్ర వాహనంపై సీకాయపాలెం వెళ్తున్నాడు. నడింపాలెం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో యేసుబాబు కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే అతడిని నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు

ముంచంగిపుట్టు: వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులను రెమిడియల్ క్లాసుల పేరుతో వేధించడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొశ్యా ధర్మారావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలు విడుదలైన వెంటనే ఉపాధ్యాయులను రెమిడియల్ క్లాసులు మొదలు పెట్టడం సరికాదని, ఫెయిలైన విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల వేసవి సెలవులను నిరోధించడం, సప్లిమెంటర్ పరీక్షలు జరిగే వరకు మండు వేసవిలో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదన్నారు. తక్షణమే రెమిడియల్ క్లాసుల కోసం ఇచ్చిన ప్రొసీడింగ్‌లను ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయులు వేసవి సెలవులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖా ఉన్నతాధికారులకు ఆయన కోరారు. యూటీఎఫ్ నేతలు రాజు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

గూడెంకొత్తవీధి: రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు జూన్ చివర వరకు గడువు పొడిగించినట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ శనివారం తెలిపారు. చాలా మందికి ఈకేవైసీ నమోదు కాలేదన్నారు. రేషన్‌కార్డులు కలిగిన వారంతా వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. బోగస్ కార్డులను ఏరివేతకు ఈకేవైసీ తోడ్పడుతుందన్నారు. రేషన్ డీలర్లు వద్ద గాని ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవచ్చని సూచించారు.

దోమల మందు పిచికారీ తప్పనిసరి



పిచికారీని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి సౌమ్య

సీలేరు: దుప్పులవాడ పంచాయతీ చల్లనిశిల్ప గ్రామంలో సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య శనివారం పర్యటించారు. మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి లోపల, బయట దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని సూచించారు. దోమ తెరలు వినియోగించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సర్పంచ్ కేలేబు కుమారి, సూపర్‌వైజర్ ఎస్.త్రినాథ్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, సిబ్బంది, పాల్గొన్నారు.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన గుల్లేలు- కోండ్రుం రోడ్డు



కనువిందు చేస్తున్న పిట్టలబొర్ర జలపాతం

పనులకు మోక్షమెన్నడో?

- పిట్టలబొర్ర, ఇనుపతీగల జలపాతాల వద్ద కానరాని సదుపాయాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పిట్టలబొర్ర జలపాతం రోడ్డుకు రూ.8 కోట్లు మంజూరు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు
- పర్యాటకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పెదబయలు: మండలంలోని పిట్టలబొర్ర(తారాబు), ఇనుపతీగల జలపాతాల అందాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. వేసవి సీజన్‌తో పాటు చలికాలంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ జలపాతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ జలపాతాల పరిసర ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం జరిగింది. ఇందులో భాగంగా గుల్లేలు పంచాయతీ కేంద్రం నుంచి గిన్నెలకోట మీదుగా ఇంజరి కోండ్రుం వరకు సుమారు 25 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం, రూడకోట నుంచి జామిగుడ మీదుగా ఒడిశా రోడ్డుకు అనుసంధానం చేస్తు తారురోడ్డు నిర్మాణం జరిగింది. రెండు రోడ్ల నిర్మాణంతో గిరిజనుల దశాబ్దాల నాటి రోడ్డు కల నెరవేరింది. **జలపాతాలకు 3 నుంచి 4 కిలోమీటర్ల వరకు తారురోడ్డు నిర్మాణం కావడంతో పిట్టలబొర్ర(తారాబు), ఇనుపతీగల జలపాతాలకు ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్** గడ్, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధికంగా వస్తున్నారు. రెండు జలపాతాల సమీపం వరకు వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ఇందులో భాగంగా భూషిపుట్టు నుంచి పిట్టలబొర్ర గ్రామం నుంచి జలపాతం పై భాగం వరకు వెళ్లేందుకు రెండు లైన్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం గ్రావెల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి.

అసంపూర్తిగా పనులు

పిట్టలబొర్ర జలపాతానికి జామిగుడ పంచాయతీ కేంద్రం నుంచి గుంజివాడ గ్రామం మీదుగా జలపాతం కింద భాగంలో వెళ్లేందుకు రోడ్డు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. జామిగుడ నుంచి జలపాతం వరకు రోడ్డుకు జామిగుడ వంతెన నిర్మాణం పనులు జరిగితే గాని రోడ్డు పనులు జరిగే అవకాశం లేదు. ప్రస్తుతం జలపాతం వద్ద వెళ్లేందుకు సరైన రహదారి లేదు. నాలుగు కిలోమీటర్లు దూరం నుంచి నడిచి వెళ్లాల్సి వస్తోంది. అలాగే గిన్నెలకోట గ్రామం నుంచి ఇనుపతీగల జలపాతం వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉన్నా రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. వర్షాలు పడితే ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జలపాతాలకు అనుసంధానం చేస్తు తారురోడ్డు సదుపాయం కల్పించిన తక్కువ దూరంలో రోడ్ల నిర్మాణం సరిగ్గా జరగడం లేదు. దీంతో పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. జలపాతాల వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ప్రభుత్వం, పర్యాటక శాఖ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. పర్యాటకులు ఎక్కువగా వస్తుండడంతో జామిగుడ గ్రామ పంచాయతీ చొరవ తీసుకుని జలపాతం వద్ద చేరేందుకు తాత్కాలికంగా కర్రల నిచ్చెలను ఏర్పాటుచేశారు. ప్రభుత్వం, ఐటీడీఏ స్పందించి రెండు జలపాతాల వద్ద వెళ్లేందుకు తారురోడ్లు నిర్మించాలని, ఈ ప్రాంతాల్లో స్టాళ్లు ఏర్పాటుచేసి స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు.



ఇనుపతీగల జలపాతం

యువతకు ఉపాధి కల్పించాలి



రెండు జలపాతాలకు పర్యాటకు సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి సదుపాయాల కల్పనతో పాటుగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. జలపాతాల వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇక్కడ రెస్క్యూ టీమ్‌లు ఏర్పాటుచేసి, దీని ద్వారా స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి.

– తెరవాడ వెంకటరావు, జామిగుడ

ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలి



పాడేరు నుంచి జామిగుడ వరకు తారురోడ్డు సదుపాయం ఉండడంతో ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించాలి. దీంతో ఈ ప్రాంత ప్రజలతో పాటు పర్యాటకులకు అనువుగా ఉంటుంది. కుమడ వరకు ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసును జామిగుడ వరకు పొడిగించాల్సి ఉంది. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించాలి.

– జర్సింగి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం



పిట్టలబొర్ర(తారాబు), ఇనుపతీగల జలపాతాల వద్ద సదుపాయాల కల్పనకు ఐటీడీఏకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం భూషిపుట్టు నుంచి పిట్టలబొర్ర వరకు తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇనుపతీగల జలపాతం వద్ద సదుపాయాల కల్పనకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం.

– ఎల్. పూర్ణయ్య, ఎంపీడీవో, పెదబయలు

రెండో రోజు బంద్ ప్రశాంతం



కించుమండ రోడ్డుపై అర్ధనగ్నంగా బైఠాయించిన నాయకులు

ముంచంగిపుట్టు: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ ప్రకటన చేయాలని, జీవో నెంబర్-3ను పునరుద్ధరించాలని ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండో రోజు మన్యం బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలు, గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్లపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందే విధంగా చూడాలన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చిన జీవో నెంబరు-3 పునరుద్ధరణ హామీని అమలుచేయాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టులో జరిగిన బంద్‌లో ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ, గిరిజన సంఘం, ప్రజా సంఘాలు,వి విధ రాజకీయ పార్టీల నేతలు పద్మారావు, కొండలరావు, సుధీర్‌కుమార్, త్రినాథ్, ఎం ఎంశ్రీను, అర్జున్, అప్పారావు, మల్లికార్జున్, బాబూరావు, రామకృష్ణ, ధర్మారావు, శ్రీనివాసమూర్తి, ప్రసన్నకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో నిర్వహించిన బంద్‌లో కితలంగి, కించుమండ సర్పంచ్‌లు వి.సుబ్బారావు, విన్సెంట్, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రాము నాయుడు, నాయకులు బాలరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో చేపట్టిన బంద్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు, అరకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సందడి కొండబాబు, బొండాపల్లి సర్పంచ్ మత్స్యరాజు, నాయకులు సూర్యనారాయణ, సన్నిబాబు, రామారావు, సింహాచలం, పూర్ణయ్య, రాంబాబు, గంగాధర్, లక్ష్మణరావు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


జి.మాడుగుల: మండలంలో చేపట్టిన బంద్‌లో ఉపాధ్యాయ సంఘం నాయకుడు మత్స్యరాజు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర, మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు మాలన్న, రాంబాబు, నాయకులు శేఖర్, ధర్మన్నపడాల్, బ్రహ్మలింగం, రాము, లక్ష్మణ్ తదితరలు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో చేపట్టిన బంద్‌లో జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, దండకారణ్య విమోచన సమితి నాయకులు, సీపీఎం నాయకులు చిన్నయ్యపడాల్, ధనుంజయ్, శేఖర్‌బాబు, కాసులమ్మ, వెంకయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలో నిర్వహించిన బంద్‌లో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ కిషోర్‌వర్మల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



బోసిపోయిన ముంచంగిపుట్టు వారపు సంత



మూతబడిన పర్యాటక కేంద్రం అరకు పైనరీ



ముంచంగిపుట్టులో రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు



అరకులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం ప్రతినిధులు



అరకులోయలో నిలిచిపోయిన ఒనకఢిల్లీ అంతర్రాష్ట్ర ప్రైవేటు సర్వీసు బస్సు



చింతపల్లి హనుమాన్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



కొయ్యూరులో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు



అరకులో మూతపడిన పెట్రోల్ బంక్



అరకులోయలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



జి.మాడుగులలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు



హుకుంపేటలో బంద్ చేస్తున్న డీఎస్సీ సాధన కమిటీ, వైఎస్సార్,గిరిజన సంఘ నేతలు

కళాశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



కళాశాలలో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: మండల కేంద్రంలో గల డిగ్రీ కళాశాలలో ప్రహరీ నిర్మాణానికి శనివారం జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం ఈ ప్రహరీ నిర్మాణానికి రూ. 1.50కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కళాశాలకు ప్రహరీ లేక పోవడంతో స్థలం ఆక్రమించుకోవడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. దీంతో ఈ సమస్యను ప్రిన్సిపాల్‌తో కలిసిన బృందం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వివరించారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వానికి నివేదించండంతో నిధులను మంజూరవడంతో పనులకు శంకుస్థాపన చేశారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపక సిబ్బంది లీలాపావని, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పెదబయలు: మండలంలోని ఈ ఏడాది టెన్త్ ఫెయిల్ అయిన విద్యారులకు డైరెక్టర్ ఆఫ స్కూల్ ఎడ్యుకేషన్ వారి మెటీరియల్, పాడేరు ఐటీడీఏ వారి పాఠ్యాంశాల మూల్యాంకణం మేరకు ఉపాధ్యాయులతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు జరుగుతున్నట్టు ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలో 328 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్‌కాగా, వారికి రెండు కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పెదబయలు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల కేంద్రం-1లో 102 మందికి, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల సీతగుంటకు-67 మంది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో- 52 మందికి శిక్షణ తరగతులు ఏర్పాటుచేశామన్నారు. ఏపీ గురుకుల రెసిడెన్షియల్ విద్యార్థులకు అరకులోయ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు హుకుంపేటలో శిక్షణ తరగతులు ఏర్పాటచేశామన్నారు. విద్యార్థులకు వసతి, భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఏనుగురాయిలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి శిరీష, సిబ్బంది

ముంచంగిపుట్టు: గర్భిణీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని ఏనుగు రాయి పంచాయతీ కేంద్రంలో శనివారం 104 వైద్య శిబిరం నిర్వహించి, 54 మందికి వైద్య సేవలు అందించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ వంటి వ్యాధులతో పాటు గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, పరిసరాల పరిశుభ్రత ఉంచుకోవాలని గ్రామస్తులకు ఆమె సూచించారు. సీహెచ్‌వో చొడప్పడు, వైద్య సిబ్బంది వేదవతి, అనిత, సత్తిబాబు,104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సదస్సులో పాల్గొని ప్రతిజ్ఞ చేస్తున్న మోటారు యూనియన్ ప్రతినిధులు



మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయ టౌన్: మోటారు వెహికల్ రూల్స్‌ను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని అరకులోయ సీఐ ఎల్ హిమగిరి సూచించారు. మండల కేంద్రంలో వాయుపుత్ర మోటారు, ఆటో, వ్యాన్, లారీ యూనియన్ ప్రతినిధులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలు కాపాడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఘాట్‌రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా హార్న్ మోగిస్తూ ప్రయాణించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో పీఆర్‌డీఈఈ రామమ్, ఆర్‌ఐ బలరాం, మోటార్ యూనియన్ ప్రతినిధులు సాంబయ్య బ్రదర్స్, వెంకటరావు, సత్యనారాయణ, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

చింతపల్లి: ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో గర్భిణులు ప్రసవాలు చేయించుకోవాలని నక్కపల్లి వైద్యాధికారి ఎ.జయలక్ష్మి చెప్పారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ఆమె ప్రత్యేక వైద్య పరీక్షలను శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భంగా దాల్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఒక్కసారైనా అల్ట్రా స్కానింగ్ చేయించుకోవాలన్నారు.ఈ స్కానింగ్‌తో గర్భిణుల ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులు ప్రసవానికి పది రోజుల ముందుగానే ఆస్పత్రి వసతి గృహంలో చేరి వైద్యసేవలు పొందాలన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రసవాలు పొందాలన్నారు. సహజ ప్రసవం పొందిన గర్భిణులు రెండు, మూడు రోజులు ఆస్పత్రిలో ఉంటే సరిపోతుందన్నారు. ఆసుపత్రికి రాకుండా గృహాల్లో చేపడుతున్న ప్రసవాలతో తల్లి బిడ్డల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఝాన్సీరాణి

పాడేరు రూరల్: మండలంలో గుడివాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. కిశోర వికాస వేసవి శిబిరాలను వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించాలని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ మార్పునకు అందరూ కృషి చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

సీలేరు: మారెమ్మ తల్లి క్రికెట్ టోర్నీలో శనివారం మూడు మ్యాచ్ లు జరిగాయి. చిత్రకొండ, ఎడ్లకొండ మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్రకొండ టీమ్ గెలిచింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో పప్పులూరు, దుర్గాదేవీ జట్లు తలపడగా, పప్పులూరు టీమ్ విజయం సాధించింది. సీలేరు ఎపిజెన్‌కో జట్టు, మోటర్‌ఫీల్డ్ జట్టు తలపడగా మోటర్‌ఫీల్డ్ జట్టు గెలిచినట్టు నిర్వాహకులు తెలిపారు.